సాక్షి
ఏలూరు
గురువారం । 9 । మే । 2024




తనిఖీలు ముమ్మరం

పెంటపాడు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హైవే ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. డీఎస్పీ మూర్తి, రూరల్ సీఐ రమేష్ తనిఖీల్లో పాల్గొన్నారు.



ఉద్యాన వర్సిటీలో సదస్సు

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో ఫీల్డింగ్ ఆవిష్కరణ, సృజనాత్మకత మేధో సంపత్తి హక్కులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. వీసీ జానకీరామ్ మాట్లాడారు.



వైఎస్సార్‌సీపీలో చేరికలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఘనంగా గురు పట్టాభిషేక మహోత్సవం



ఆరోన్ ఫాదర్‌ను సత్కరిస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు మైఖేల్ చర్చ్ ఫాదర్ ఆరోన్ గురుపట్టాభిషేక మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ ఆరోన్ ఫాదర్ మాట కఠినంగా ఉన్నా మనసు మాత్రం వెన్నతో సమానం అన్నారు. ఆరోన్ ఫాదర్ 40 ఏళ్లుగా క్రైస్తవ సమాజానికి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, దైవ సేవలో ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. ఫాదర్ ఆరోన్ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ఇదే రోజు వట్లూరులో గురుపట్టాభిషేకం పొందిన తాను నిర్మలగిరి కొండపైన 90 ఎకరాల్లో ఆలయ అభివృద్ధి చేశానన్నారు. తన గురువు నిర్మించిన ఈ మైఖేల్ చర్చ్ అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరమని, ఇప్పటి నుంచి తాను ఈ చర్చ్ అభివృద్ధికి కృషి చేస్తానని దేవుని సేవలో ఇలా భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. అనంతరం ఫాదర్ ఆరోన్‌ను బిషప్ జయరావు, పలువురు ఫాదర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ బాల, ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ ఐ.మైఖేల్ ఫాదర్, ఫాదర్ చైతన్య, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఈనెల 13న జరుగనున్న ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కోరారు. ఎన్నికలలో భాగంగా పోలింగ్, పోలింగ్ ముందు రోజు (ఈనెల 12, 13 తేదీల్లో) జిల్లాస్థాయిలో దినపత్రికల్లో ప్రచురించే రాజకీయ ప్రకటనలకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ప్రకటనలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేలా మేనిఫెస్టోలో పేర్కొనే అంశాలు, తదితర పార్టీ సంబంధిత స్లోగన్లు వంటివి ఉండకూడదని, తమకు ఓటు వేయాలని కోరడం, కేవలం ఆయా అభ్యర్థులు, వారి పార్టీ గుర్తు, ఈవీఎం పరికరంలో వారి పేరు, పార్టీ చిహ్నం, ఇండిపెండెంట్, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తు, బ్యాలెట్ బాక్సులలో వారి క్రమ సంఖ్య ఉండే వివరాలతో మాత్రమే అనుమతి మంజూరు చేస్తామన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రక్రియలో, హోర్డింగ్స్, తదితర అంశాలపై ఇప్పటివరకు జారీ చేసిన అన్ని ప్రకటనలు ఈనెల 11న సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.

పాలిసెట్‌లో 3,071 మంది ఉత్తీర్ణత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన పాలిసెట్ పరీక్షల్లో జిల్లావిద్యార్థులు 3,071 మంది ఉత్తీర్ణులయ్యారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కైకలూరుకు చెందిన రాయగిరి వెంకట భావన సాయి 119వ ర్యాంకు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచాడు. భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన చల్లా జోషిత్ 155వ ర్యాంకు, ఏలూరుకు చెందిన సంకు యశ్వంత్ ఫణికుమార్ 195వ ర్యాంకు సాధించాడు. జిల్లా నుంచి పాలిసెట్‌కు 3,417 మంది హాజరయ్యారు. వీరిలో 2,121 మంది బాలురు, 1,296 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 1,873 మంది బాలురు, 1,198 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా జిల్లా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 89.87గా కాగా వీరిలో బాలుర ఉత్తీర్ణత శాతం 88.31, బాలికల ఉత్తీర్ణత శాతం 92.44 ఉంది.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024–25లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని, గురువారం నుంచి జూన్ 10వ తేదీ వరకు అవకాశం ఉందని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూన్ 10న సాయంత్రం 5 గంటలలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వీరు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో 808, ప్రైవేట్ ఐటీఐల్లో 1,672 మొత్తంగా 2,480 సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు 08812 230269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బడాయి పుట్టా

పార్లమెంట్ నియోజకవర్గ హద్దులు, ప్రధాన అంశాలు, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు పూర్తిగా తెలియవు. కనీసం ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో పర్యటన చేయలేదు. అయినా ఎంపీగా గెలవగానే ఆ కంపెనీ పెడతా.. ఈ కంపెనీలు తీసుకువస్తా.. ఇప్పటికే ప్రముఖులతో మాట్లాడేశానంటూ బడాయి మాటలు చెబుతున్నారు ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్. ఇదిలా ఉండగా టీడీపీ సీనియర్ నేతలు, కూటమిలోని బీజేపీ నేతల నుంచి పూర్తి సహకారం లేకపోవడం, ఎమ్మెల్యే అభ్యర్థులు పట్టించుకోకపోవడంతో సోషల్ మీడియానే దిక్కుగా భావించి ఇంటర్వ్యూలు, షార్ట్స్, రీల్స్‌లో బిజీగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారాయన.

పైన పటారం.. లోన లొటారం

- టీడీపీ ఎంపీ అభ్యర్థిని పట్టించుకోని సీనియర్లు
- మాజీ ఎంపీ మాగంటి, బీజేపీ నేత తపన సహాయ నిరాకరణ
- సొంత టీమ్‌ను రంగంలోకి దింపిన పుట్టా మహేష్
- అద్భుతాలు చేస్తామంటూ అలవికాని హామీలు
- ఎన్నికల ప్రచారం అంతంత మాత్రమే
- సోషల్ మీడియా, యూట్యూబ్ ప్రచారాలే దిక్కు



సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ పరిస్థితి పార్లమెంట్ నియోజకవర్గంలో అగమ్యగోచరంగా ఉంది. ప్రధానంగా ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన మాగంటి బాబు టీడీపీలో సీనియర్ నేత, అలాగే ప్రస్తుత ఉన్న నాయకుల్లో ఎంపీగాను జిల్లాలో సీనియర్. ఆయన పూర్తిగా పుట్టా మహేష్‌యాదవ్‌ను దూరం పెట్టారు. అది ఏస్థాయిలో అంటే కనీసం కలవడానికి కూడా ఇష్టపడని రీతిలో. ఇక కూటమిలో మరో కీలక నేతగా ఉన్న బీజేపీ నేత తపన చౌదరి ఎంపీ టికెట్ ఆశించి నియోజకవర్గవ్యాప్తంగా హోర్డింగులు ఏర్పాటు చేసి, భారీ సభలు నిర్వహించి భంగపడ్డారు. తపన చౌదరి కూడా పూర్తిస్థాయిలో మహేష్‌ను కలవడానికి ఇష్టపడని పరిస్థితి.

వివాదాలతో అర్థం కాని పరిస్థితి..

సీనియర్లు దూరం పెట్టడంతో ఎమ్మెల్యే అభ్యర్థుల పైనే ఎక్కువ ఆశలు పెట్టుకుని నియోజకవర్గాల్లో ఒక రౌండ్ పర్యటనలు పూర్తి చేశారు మహేష్. కట్ చేస్తే.. పోలవరంలో టీడీపీ, జనసేన నేతల మధ్య తారాస్థాయి వివాదాలతో ఏం చేయాలో అర్థం కాక మళ్లీ అటువైపు కన్నెత్తి చూడలేదు. చింతలపూడిలో పర్యటిస్తే టీడీపీ కొత్త, పాత నేతల వివాదాలతో తలనొప్పి వచ్చింది. ఇక ఉంగుటూరు జనసేన అభ్యర్థి, కైకలూరు బీజేపీ అభ్యర్థి, నూజివీడులో టీడీపీ అభ్యర్థి నుంచి ఆహ్వానాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో సోషల్ మీడియానే నమ్ముకుని హడావుడి మొదలుపెట్టినా అంతగా వర్కఅవుట్ కాలేదు. అంశాల వారీగా సమస్యలపై అవగాహన ఉందని మాట్లాడటం, ఎంపీగా గెలిచిన వెంటనే ఏలూరులో జీఎంఆర్ వాళ్ల కంపెనీ పెడతానని, ఇప్పటికే మాట్లాడేశానని, పెద్ద కాంట్రాక్టర్‌ను కాబట్టి పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులు ఎలా పూర్తిచేయాలో తెలుసంటూ సోషల్ మీడియాలో వీడియోలు, యూట్యూబ్ చానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటనల్లో మెరిసిన నేత.. లోకేష్ పర్యటనలో మాత్రం కనిపించకపోవడంతో టీడీపీలోనే చర్చ సాగింది.

కూటమి నుంచే తీవ్ర ప్రతిఘటన

మాజీ ఎంపీ మాగంటి బాబు, బీజేపీ నేత గారపాటి తపనచౌదరి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. మాగంటి బాబు కలిసే ప్రయత్నం చేసి మధ్యలో చింతమనేనితో రాయబారం నడిపినా, వేరేలా మాట్లాడటానికి ప్రయత్నించినా వర్కఅవుట్ కాలేదు. కనీసం అభ్యర్థిని, ఫలానా వారిని పెడుతున్నామని కూడా చెప్పకుండా చంద్రబాబు ద్రోహం చేశారని మాగంటి బాబు, ఆయన వర్గీయులు రగిలిపోతున్నారు. దీంతో ఆయన పార్టీలోనే ఉన్నా పూర్తిగా ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇక బీజేపీ నేత గారపాటి పరిస్థితి విభిన్నం. ఏలూరు ఎంపీ టికెట్ కోసం విపరీతంగా ప్రయత్నించి భంగపడగా దెందులూరు అసెంబ్లీ స్థానం ఇస్తారని హడావుడి చేశారు. కట్ చేస్తే.. అది కూడా వర్కఅవుట్ కాకపోవడంతో ఆత్మీయ సమావేశం నిర్వహించి పరోక్షంగా రాజకీయ రాబందులు వస్తున్నాయి.. అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ మాట్లాడారు. పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటారని విస్తృతంగా అనుచరగణంతో ప్రచారం చేయించారు. కానీ నరసాపురం బీజేపీ ఎంపీ అభ్యర్థి కోసం అక్కడ ఎన్నికల ప్రచారంలో బిజీగా మారిపోయి సైలెంట్ అయిపోయారు. కనీసం కూటమి అభ్యర్థి కలవడానికి ప్రయత్నించినా పట్టించుకోకపోవడం గమనార్హం. చివరి నిమిషంలో హడావుడిగా రావడం, డబ్బుతో అన్ని సెట్ చేసుకోవచ్చని ఆశించిన పుట్టా మహేష్‌యాదవ్‌కు భంగపాటే ఎదురైంది.

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



ఓటేసిన జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు(మెట్రో): జిల్లాలో నాలుగో రోజు బుధవారం కూడా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైందని జిల్లా మీడియా సమన్వయకర్త, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. రిటర్నింగ్ అధికారులు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ఉద్యోగులు తమ ఓటు హక్కు సజావుగా ఉపయోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. అత్యవసర సర్వీసెస్, ఆర్టీసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. పోలింగ్ సజావుగా జరగడానికి టోకెన్ సిస్టమ్ ఏర్పాటు చేశారని, అలాగే హెల్ప్ డెస్కులు, తాగునీరు, మినీ వైద్య శిబిరాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తున్న ఉద్యోగులకు సమాచారం అందించడానికి, సహకరించడానికి పోలింగ్ కేంద్రాల వద్ద లైజన్ అధికారులను ఏర్పాటు చేశారన్నారు. తక్షణ సమాచారం కోసం తనను 9849903321 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

అందరూ ఓటేయాలి

ఏలూరు టౌన్: ప్రతి పౌరుడూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి అన్నారు. ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆమె ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేతివేలిని చూపిస్తూ.. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

10న గూడెంలో సీఎం జగన్ సభ



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 10న శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిగూడెంలో మేమంతా సిద్ధం ఎన్నికల సభ నిర్వహించనున్నారని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని పోలీసు ఐల్యాండ్ సమీపంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్ సెంటర్‌లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యకర్తల అభీష్టాన్ని అధినేత దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ సభ నిర్వహించాలని కోరగా ముఖ్యమంత్రి జగన్ అంగీకరించారన్నారు. సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యటనకు సంబంధించి సభాస్థలి, పార్కింగ్ తదితర ప్రాంతాలను మంత్రి కొట్టు సందర్శించారు. ఆయన వెంట అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఉన్నారు.

జిల్లాలో 1,744 పోలింగ్ కేంద్రాలు సిద్ధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



పోలింగ్ నిర్వహణ సన్నద్ధతపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎన్నికల పరిశీలకులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల సన్నద్ధత, ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించేందుకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతిలతో సాధారణ వ్యయ పరిశీలకులు డా. కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఏ రామన్, పోలీస్ అబ్జర్వర్ టి.శ్రీధర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 1,744 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13వ తేదీన నిర్వహించే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ పోటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఈవీఎం కమిషనింగ్ సంబంధించిన తాజా స్థితిని వివరించారు. ఓటరు స్లిప్పుల (ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు) పంపిణీ కూడా దాదాపు పూర్తయిందన్నారు. ఎన్నికల పోలింగ్ సామగ్రి, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్, సెంటర్లలో ఏర్పాట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీస్ బందోబస్తు, శాంతిభద్రతల వివరాలను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి వివరించారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

దేశవ్యాప్తంగా నాలుగో దశలో ఈనెల 13న పోలింగ్ జరుగనున్న 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులతో చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ సమీక్షించారు. నాలుగో దశ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘంచే నియమించిన సాధారణ, పోలీస్, వ్యయ సెంట్రల్ అబ్జర్వర్లకు దిశా నిర్దేశం చేశారు. ఆయనతో పాటు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సందు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఏలూరు కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. కృష్ణకాంత్ పాఠక్, పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఎస్ఏ రామన్, పోలీస్ అబ్జర్వర్ టి.శ్రీధర్, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు టి.జోర్డాన్ బూటియా, చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు పి.కీర్తినారాయణ్, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మేశ్రమ్ గౌరవ్ మధుకర్ హాజరయ్యారు.

జనసేన కార్యకర్తలపై కేసుల నమోదు

తాడేపల్లిగూడెం: జనసేన కార్యకర్తలపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. స్థానిక కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను మభ్యపెట్టేలా నగదు పంపిణీ చేయడం, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడంపై పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈనెల 6, 7 తేదీల్లో జనసేన శ్రేణుల ప్రలోభాలపై ఆర్ఓ చెన్నయ్యకు ఆరు వీడియోలు, 15 ఫొటోలు అందాయి. వీటిని పరిశీలించి, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి 2024 ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనలకు గాను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్ఓ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 156 కింద సెక్షన్లు 188 , 171 రెడ్ విత్ 34 ఐపీసీ నిబంధనల మేరకు కేసులు కట్టారు. తోట రాజా, మేరుగు రాజగోపాల్, అంగిన దేవేంద్ర, కూడవల్లి రాజు అనే జనసేన కార్యకర్తలపై పట్టణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ కేసులు నమోదు చేశారు.

11న కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

భీమవరం: పట్టణంలో ఈనెల 11న 14 కోర్టుల నూతన భవనం నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తులు శంకుస్థాపన చేయనున్నారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ ఆకుల శేషసాయి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

దశాబ్దాల కొల్లేరు కల నెరవేర్చాను



సాక్షితో కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)

ఇంటర్వ్యూ

డీఎన్నార్ (దూలం నాగేశ్వరరావు) ఈ పేరు చెప్పగానే కూరగాయలు, పూల విక్రయాల నుంచి స్వయంకృషితో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన కష్టం కనిపిస్తుంది. ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన కరోనాతో రెండుసార్లు ఐసీయూలో, తలకు ఆపరేషన్‌తో కొంత విశ్రాంతి తీసుకున్న సమయం తప్ప మిగిలిన కాలం అంతా నియోజకవర్గ ప్రజలతో మమేకమై తిరిగారు. పార్టీలు చూడకుండా జగనన్న కాలనీల్లో అర్హతే ప్రామాణికంగా స్థలాలు కేటాయించారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో వడదెబ్బ తగిలి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి తిరగొచ్చారు. నీరసంగా ఉన్నా ఆయన మాట్లాడుతూ అమెరికా, హైదరాబాద్‌లలో ఉండే బీజేపీ అభ్యర్థి కామినేని కావాలా? నిత్యం అందుబాటులో ఉండే తాను కావాలా? ఆలోచించుకోవాలని ఓటర్లను కోరారు. – కైకలూరు

సాక్షి: రాజకీయాల్లోకి రావడానికి మీకు స్ఫూర్తి?

డీఎన్నార్: నాకు చిన్నప్పటి నుంచి కష్టపడేతత్వం ఉంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రజలు దేవుడిగా కొలిచేవారు. నేను ఆయన సమక్షంలో పార్టీలో చేరాను. రాజశేఖరరెడ్డి చేసిన మంచి పనులు నాకు స్ఫూర్తిని కలిగించాయి. నేడు తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ ప్రజలకు సేవ చేస్తున్నారు.

సాక్షి: కొల్లేరు గ్రామాలకు మీరు ఏం చేశారు?

డీఎన్నార్: కొల్లేరు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలను నిర్మించాం. రహదారులు ఏర్పాటు చేశాం. ప్రధానంగా గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధిని రూ.14.47 కోట్లతో నిర్మించాం. దీంతో దశాబ్దాలుగా కొల్లేరు ప్రజలకు తీరని కల నెరవేరింది. పందిరిపల్లిగూడెం నుంచి గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు వరకు రూ.3.06 కోట్ల నిధులను కేటాయించాం. సిద్ధాంతం–పెదఎడ్లగాడి రోడ్డు నిర్మాణానికి రూ.7.80 కోట్లు మంజూరయ్యాయి. ఇలా పలు కార్యక్రమాలు కొల్లేరు ప్రజల కోసం చేశాం.

సాక్షి: ప్రస్తుత ఎన్నికల్లో మీ బలం?

డీఎన్నార్ : నా నియోజకవర్గ ప్రజలే నా బలం. మంచి చేస్తేనే మా పార్టీకి ఓటేయండని సీఎం జగన్ ఎలా చెబుతున్నారో.. అలాగే నేను ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాను. నా కుమారులు కూడా ప్రజాసేవలో ఎప్పుడు ముందున్నారు. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి చేశాను. అవన్నీ కంటికి కనిపిస్తున్నాయి. ప్రజలు మరోసారి నన్ను ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను.

సాక్షి: కొల్లేరు భూములు మీరు ఆక్రమించడం నిజమేనా?

డీఎన్నార్: నన్ను విమర్శించడానికి ఏ వంకా లేదు. ఏదో కొల్లేరు భూములని బురద జల్లుతున్నారు. నాకు, నా కుమారులకు ఎటువంటి కొల్లేరు భూములు లేవని వాస్తవంగా నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. ఎన్నికలు వచ్చాయని దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారు. ఇది తప్పు.

సాక్షి: కైకలూరు సీహెచ్‌సీపై ప్రతిపక్షాల విమర్శలు నిజమేనా?

డీఎన్నార్ : కామినేని శ్రీనివాస్ ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేశారు. తర్వాత దానిని గాలికొదిలేశారు. డాక్టర్లు లేరు, వసతులు ఏమీ లేవు. నేను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాం. ప్రధానంగా ఐదు పడకల డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు రోగులకు సేవలు అందుతున్నాయి. కరోనా సమయంలో దాతల సాయంతో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేసి ఎందరో ప్రాణాలను కాపాడాను. అన్నిరకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

సాక్షి: కుటుంబసభ్యుల ప్రోత్సాహం ఎలా ఉంది?

డీఎన్నార్ : నిజంగా నేను చాలా అదృష్టవంతుడిని. ఎన్నికల్లో మరోసారి నేను గెలవాలని నా సతీమణి, కుమారులు, కోడళ్లు, మనవళ్లు ఇలా అందరూ ప్రజలను కలిసి ఓట్లు అడుగుతున్నారు. ఎండను సైతం లెక్కచేయడం లేదు. నా ఆరోగ్యంపై చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు.

సాక్షి : ప్రస్తుత ఎన్నికల్లో మీ విజయంపై అభిప్రాయం ?

డీఎన్నార్ : నియోజకవర్గంలో ప్రతి ఇంటి గడప నేను తొక్కి యోగక్షేమాలు అడిగాను. బహుశా నియోజకవర్గ చరిత్రలో నాకు మాదిరిగా ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే మరొకరు ఉండకపోవచ్చు. ఐదేళ్ల కాలంలో రూ.1,701.61 కోట్ల అభివృద్ధి పనులు చేశాను. ప్రజలకు మంచి చేసిన నేను కచ్చితంగా మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి తీరుతాను.

నూజివీడు.. అభివృద్ధి రేడు

క్లుప్తంగా

వాహన తనిఖీల్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం



తనిఖీల్లో నగదును స్వాధీనపరుచుకున్న ఎన్నికల అధికారులు

కామవరపుకోట : కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం ఒక వ్యక్తి నుంచి రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. వీరిశెట్టిగూడెంకు కారులో వెళుతున్న వ్యక్తి నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ఏఎస్సై స్వామి ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. తనిఖీలలో పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యరావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, వీడియోగ్రాఫర్లు వీరమల్ల మధు, సౌజన్ సాయి పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా కోర్టు, మహిళా కోర్టు జిల్లా న్యాయమూర్తి జి.రాజేశ్వరి బుధవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్థానిక ఆముదాల అప్పలస్వామి కాలనీలో దివ్యాంగురాలైన కుమార్తెతో కలిసి ఓ మహిళ నివాసం ఉంటోంది. ఈ క్రమంలో 2016 ఏప్రిల్ నెలలో ఇంట్లో ఒంటరిగా ఉన్న పుట్టుకతో రెండు కాళ్లతో నడవలేని దివ్యాంగ యువతిపై అదే ప్రాంతానికి చెందిన వేముల అప్పనపల్లి అనే అప్పనపల్లి వెంకటరమణ అత్యాచారం చేశాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన మహిళకు స్థానికంగా ఉండే మరో మహిళ విషయం చెప్పింది. ఆమె తలుపు తట్టగా గదిలో నుంచి నిందితుడు పరారయ్యాడు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ ఎస్సై రాంబాబు కేసు నమోదు చేశారు. దీనిపై సీఐ రాజశేఖర్ దర్యాప్తు చేసి చార్జిషీటును కోర్టులో ఫైల్ చేశారు. ఈ కేసులో నిందితుడు వేముల అప్పనపల్లిపై నేరం రుజువు కావడంతో అతనికి పదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ జడ్జి జి.రాజేశ్వరి తీర్పునిచ్చారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు ప్రాసిక్యూషన్ నిర్వహించగా, ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు బి.మల్లికార్జునరావు, సంగయ్యలు, లైజన్ ఆఫీసర్ రుక్మంధరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

నూజివీడు: జమిందారుల కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి నూజివీడుకు మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేసిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నాలుగోసారి ఎన్నికల బరిలోకి దిగారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటం, పేదల అభ్యున్నతికి, నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషికి తోడు, నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానం, వైఎస్సార్ సీపీ శ్రేణుల సమష్టి కృషి ఈ ఎన్నికల్లో మరోసారి తనకు విజయాన్ని అందిస్తాయని నూజివీడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు ధీమా వ్యక్తం చేశారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

ఇంటర్వ్యూ

- జమీందారీ కుటుంబం నుంచి వచ్చినా దర్పానికి దూరం
- ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి
- రూ.33 కోట్లతో నూజివీడు – విజయవాడ రోడ్డు అభివృద్ధి చేశాం
- ఏరియా ఆసుపత్రిలో రూ.25 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించాం
- చింతలపూడి ఎత్తిపోతల ద్వారా నూజివీడుకు సాగునీరు తీసుకువస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ప్రశ్న : మీరు రాజకీయాల్లోకి ఎలా వచ్చారు?

మేకా ప్రతాప్ : మా బంధువైన ఎమ్మార్ అప్పారావు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పనిచేశారు. చిన్నప్పటి నుంచి ఆయనకు దగ్గరగా ఉంటూ ఆయన వెనుకే ఉండటంతో రాజకీయాలంటే ఆసక్తి ఏర్పడింది. చదువుకునే రోజుల్లో కూడా విద్యార్థి సంఘం అధ్యక్షునిగా పనిచేశాను. దీంతో 1983లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నూజివీడు నుంచి కోటగిరి హనుమంతరావు స్వతంత్ర్య అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబెట్టి ఆయన విజయానికి కృషి చేశా. ఆ తరువాత 1985లో ఎన్టీఆర్‌పై అభిమానంతో టీడీపీలో చేరాం. ఆయన ఎంతో గౌరవంగా చూసేవారు. పార్టీ స్టేట్ కమిటీలో పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారు.

ప్రశ్న : పేదల కోసం ఏమి చేశారు?

మేకా ప్రతాప్ : నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా. ఈ కాలంలో పేదల కోసం ఎన్నో పనులు చేశా. నివేశన స్థలాలు ఇప్పించడం, పక్కా గృహాలు మంజూరు చేయడం, అస్సైన్‌మెంట్ పట్టాలు, అటవీహక్కుల చట్టం కింద గిరిజనులకు పట్టాలు మంజూరు చేయించడం తదితర అనేక పనులు చేశా. రావిచర్లలో ఎస్టేట్ భూములుంటే వాటికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పట్టాలు ఇప్పించా. సన్న, చిన్నకారు రైతుల కోసం యనమదలలో రెండు లిఫ్టు ఇరిగేషన్‌లు నిర్మించాం.

ప్రశ్న : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండటం ఎలా సాధ్యమవుతోంది?

మేకా ప్రతాప్ : ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 5 గంటల వరకు రాత్రి 11 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటా. తనను కలవాలంటే అభిమాని దగ్గర నుంచి పైస్థాయి వరకు కూడా ఎవరి అనుమతి తీసుకోవాల్సిన పనిలేదు. నేరుగా నా దగ్గరకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవచ్చు. రాజకీయాల్లోకి వచ్చిన 40 ఏళ్ల నుంచి నా దినచర్య ఇదే. ఇక ముందు కూడా ఇలాగే ఉంటుంది. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించినప్పుడు వారి కళ్లల్లో కనిపించే కృతజ్ఞతాభావం నాకు ఎంతో సంతృప్తి నిస్తుంది. దానిని డబ్బులతో వెలకట్టలేం.

ప్రశ్న : రాజకీయాల్లో మీకు ఎవరు స్ఫూర్తి ?

మేకా ప్రతాప్ :రాజకీయాల్లో ఇద్దరే నాకు స్ఫూర్తి. ఒకరు ఎన్టీఆర్ అయితే, మరొకరు మహానుభావుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. నన్ను ఎన్టీఆర్ ఎంతో అభిమానించేవారు. ఆయన చనిపోయాక చంద్రబాబు పట్టించుకోలేదు. కనీసం కలవడానికి కూడా ఇష్టపడేవాడు కాదు. ఆయన వాడుకుని వదిలేసే రకం. అందుకే విరక్తి పుట్టి టీడీపీ నుంచి బయటకు వచ్చేశా. 1999లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తే 40 వేల ఓట్లు వచ్చాయి. దీంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నన్ను గుర్తించి 2004లో ఎమ్మెల్యేగా గెలిపించి రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చారు. వైఎస్ ఎప్పుడూ కొన్ని సూచనలు చేసేవారు. ఎవరిని చూసి భయపడాల్సిన పనిలేదని, ప్రజలకు కచ్చితంగా సేవ చేస్తే వారు అక్కున చేర్చుకుంటారని చెప్పేవారు. ప్రజలందరికి సేవ చేయడమే నా అభిమతం.

ప్రశ్న : ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు ఏమిటి?

మేకా ప్రతాప్ : ఈ ఐదేళ్లలో ఎన్నో పనులు చేశాం. ముఖ్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా 14 వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలను మంజూరు చేయించాం. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు ఆర్‌వోఆర్ పట్టాలను, పేదలు సాగు చేసుకుంటున్న భూములకు ఎస్సైన్‌మెంట్ పట్టాలను ఇచ్చాం. బోర్వంచ నుంచి యనమదల వరకు, పాతరావిచర్ల నుంచి మొర్సపూడి వరకు రూ.7 కోట్లతో తారురోడ్లను నిర్మించాం. నూజివీడు నుంచి విజయవాడ రోడ్డును రూ.33 కోట్లతో విస్తరించి అభివృద్ధి చేశాం. ఏరియా ఆసుపత్రిలో రూ.25 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించాం. రెండు అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.1.60 కోట్లతో భవనాలను నిర్మించాం. ఆగిరిపల్లి, రమణక్కపేటల్లో రూ.5 కోట్లతో పీహెచ్‌సీలకు నూతన భవనాలను నిర్మించాం. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశాం.

ప్రశ్న : ఈ సారి నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి?

మేకా ప్రతాప్ : నూతనంగా మంజూరు చేసిన కేంద్రీయ విద్యాలయాన్ని జులైలో ప్రారంభిస్తాం. అన్నవరం వద్ద స్టేడియంను నిర్మించేందుకు కృషి చేస్తా. మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు రూ.25 కోట్లతో బైపాస్ రోడ్డును నిర్మిస్తాం. పట్టణానికి సీఎం వైఎస్ జగన్ మంజూరు చేసిన రూ.16 కోట్లతో పట్టణంలో డ్రెయిన్లు నిర్మిస్తాం. నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో కోర్టుల్లో కేసుల కారణంగా ఇంకా ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది. వాటన్నింటిని కూడా పూర్తి చేస్తాం. పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంలో నూతన కోర్సులను తీసుకువస్తా. చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేయడం టీడీపీ వారి వల్ల కాదు. దానిని పూర్తి చేసే సత్తా సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే ఉంది. దానిని పూర్తి చేసి నూజివీడుకు నీళ్లు తీసుకువస్తా.

ప్రశ్న : నియోజకవర్గ ప్రజలను మీరు కోరేది?

మేకా ప్రతాప్ : మీకు మంచి చేశానని అనుకుంటేనే నాకు ఓటేయండి అని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి దేశంలో ఏపీలో కాకుండా ఇంకెక్కడైనా ఉన్నారా.. అదీ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకం, ధైర్యం అంటే. ప్రజలకు ఎంతో సేవ చేసి మళ్లీ ఓట్లు వేయమని అడుగుతున్నా. వారు కచ్చితంగా నన్ను గెలిపిస్తారనే నమ్మకం, విశ్వాసం ఉంది. చంద్రబాబు లాగా హామీలిచ్చి అధికారం వచ్చాక మోసగించడం మా ప్రభుత్వం చేయలేదు. 99 శాతం హామీలను అమలు చేశాం. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఓటేసి గెలిపించాలని కోరుతున్నా.

చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు

కైకరం ప్రచారంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వాసుబాబు, కారుమూరి సునీల్



కైకరంలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు : పేదలు పెన్నిధి జగన్‌మోహన్‌రెడ్డి అని ఉంగుటూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలం అప్పారావుపేట, తల్లాపురం, కైకరం, గోకవరం, గోపరాజుపాడు, తిమ్మయ్యపాలెం, కొత్తగూడెం, చేబ్రోలు గ్రామాల్లో వాసుబాబు ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. కైకరంలో జరిగిన కార్యక్రమంలో వాసుబాబుతో పాటు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చెప్పే మాయమాటలు నమ్మవద్దని హితవు పలికారు. వలంటీర్ వ్యవస్థ మంచిది కాదని, గోనె సంచులు మోసే ఉద్యోగం అది అని ఎద్దేవా చేసిన చంద్రబాబు, వారికి రూ.10వేలు ఇస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే 2019లో ఇచ్చిన హామీలన్నీ ఏ ఒక్కటీ అమలు చేయని విషయాన్ని ఎవరూ మరిచిపోవద్దని చెప్పారు. చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఈ రాష్ట్రంలో రూ.2.70 కోట్లు ఐదేళ్ల పాలనలో డీబీటీ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో వేయడం జరిగిందన్నారు. నాలుగేళ్లలో అవినీతి రహిత పాలన జరిగిందన్నారు. పాఠశాలల్లో సమూలమైన మార్పులు నాడు–నేడు ద్వారా తీసుకువచ్చారని కారుమూరి అన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి గ్రామాల్లో పరిపాలన దగ్గర చేసిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, సచివాలయ భవనాలతో గ్రామాల్లో రూపురేఖలు మారాయని వారు వివరించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని పనిచేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వాసుబాబు, కారుమూరి సునీల్‌కుమార్‌కు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చారు. గ్రామాల్లో పూలు చల్లుకుంటూ వాసుబాబుకు స్వాగతం పలికారు. టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సుబ్బరాజు, ఉంగటూరు జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల గోపి, మండలాధ్యక్షులు మరడా మంగారావు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలు వైఎస్సార్ సీపీ పక్షమే



కొట్టాదలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ప్రచారానికి కొల్లేరు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కొట్టాడ, పందిరిపల్లిగూడెం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్సీ ప్రచారం చేశారు. పందిరిపల్లిగూడెంలో మహిళలు అడుగడుగునా పూలు చల్లారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నాకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి అక్కున చేర్చుకున్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత కొల్లేరు ప్రజలపై ఉందన్నారు. కొల్లేరు పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం పూర్తి చేసి కొల్లేరు గ్రామాలను అనుసంధానం చేసిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదేనన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ముంగర నరసింహారావు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, అబ్రహాం లింకన్, సర్పంచులు బలే వెంకటరమణ, జయమంగళ కాసులు, నాయకులు పొన్నబండ శ్యాంబాబు, సిద్దాబత్తిన సతీష్, సైదు కామేష్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో పదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్) : బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ పోక్సో అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్, స్పెషల్ కోర్టు స్పెషల్ జడ్జి, ఫస్ట్ అడిషనల్ సెషన్స్ జడ్జి ఎస్.ఉమాసునంద బుధవారం తీర్పును వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి స్పెషల్ అడిషనల్ పీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలోని బూరాయిగూడెంలో నాలుగో తరగతి చదువుతున్న నిందితుడి బంధువు, ఫిర్యాది స్నేహితురాలు స్కూల్‌లో 2016 జూన్ 18న ఫిర్యాది గాజులను తీసుకుంది. ఈ గాజుల కొరకు ఫిర్యాది నిందితుడి ఇంటికి వెళ్లగా స్నేహితురాలు గాజులు స్కూలులో ఇస్తానని చెప్పడంతో తిరిగి స్కూలుకు వెళుతుండగా నిందితుడు ఫిర్యాదిని పట్టుకుని గదిలోకి తీసుకెళ్లి అత్యాచార యత్నం చేశాడు. అక్కడ నుంచి తప్పించుకుని వచ్చిన ఫిర్యాది జరిగిన విషయాన్ని తన తల్లికి తెలియజేయడంతో ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై ఎంవీ సుభాష్ కేసు నమోదు చేయగా, అప్పటి డీఎస్పీ జి.వెంకటేశ్వరరావు ఈ కేసుపై దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. దీనిపై విచారణ పూర్తి కావడంతో జడ్జి ఉమాసునంద ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంకు చెందిన నిందితుడు మాటూరి భుజంగరావు అనే వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో కోర్టు ఎదుట స్పెషల్ ఏపీపీ డీవీ రామాంజనేయులు బాధితుల తరుపున వాదనలు వినిపించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్సై కె.రాజారెడ్డి కోర్టు కానిస్టేబుల్ డి.సురేంద్రబాబు, కోర్టు లైజనింగ్ అధికారులను ఎస్పీ డి.మేరీప్రశాంతి అభినందించారు.

వైఎస్సార్ సీపీలోకి ముమ్మరంగా చేరికలు



చంటినాయన సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన మీర్జాపురం కంద్రికకు చెందిన కార్యకర్తలు

నూజివీడు : చంద్రబాబు మాయమాటలు నమ్మి టీడీపీకి ఓటు వేస్తే కష్టాలు తప్పవని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. మీర్జాపురం శివారు కంద్రికకు చెందిన యాదవ సామాజిక వర్గం నుంచి పుట్ట బలేస్వామి, అంగడాల ఉమామహేశ్వరరావు, కొలుసు నీలకంఠం, అంగడాల మణికంఠ, పుట్టి ఏసురాజు, అంగడాల ప్రదీప్, జొన్నలగడ్డ రామాంజనేయులు, నెర్సు సాంబయ్య తదితరులు 20 కుటుంబాల వారు చంటినాయన సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో బుధవారం రాత్రి చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ తరుపున ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్యే ప్రతాప్ సమక్షంలో..

ఆగిరిపల్లి: మండలంలో ఆగిరిపల్లి, చిన్నగిరిపల్లి, కొత్త ఈదర గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు టీడీపీ, బీజేపీ నుంచి ఆగిరిపల్లిలో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. బీజేపీకి చెందిన జిల్లా బీసీ నాయకుడు దొడ్డ నాగరాజుకు ఎమ్మెల్యే ప్రతాప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన ఎర్ర సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు, జాలిపర్తి రాజాబాబు, జల్లి కొండలు, సుబ్బారావు, షేక్ బాజాని, షేక్ పటేల్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న నూజివీడు లో పెనమలూరు నుండి వలస వచ్చిన టిడిపి అభ్యర్థి పార్థసారథి నూజివీడులో రౌడీయిజం చేయాలని చూస్తున్నారని, వారి ఆటలను ఎట్టి పరిస్థితిలో సాగనివ్వనని ఓటుతో ప్రజలు పెనమలూరుకు తరిమికొట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా సునీల్ కుమార్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఎంపీటీసీ సభ్యులు సాదం గోపి సర్పంచ్ అత్తి మురళీ, మాజీ ఎంపీటీసీ సభ్యులు నక్కనబోయిన పండు, వాకాసకేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి డయాలసిస్ సేవలు

- కైకలూరులో 5 పడకల డయాలసిస్ సెంటర్ ఏర్పాటు
- ఎమ్మెల్యే డీఎన్నార్ కృషితో ప్రారంభమైన సేవలు
- కిడ్నీ, లివర్ బాధితులకు తప్పిన వ్యయప్రయాసలు



కైకలూరు సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్‌లో రోగులకు చికిత్స ప్రారంభించిన డాక్టర్లు

కైకలూరు : కిడ్నీ, లివర్ వ్యాధులకు చికిత్స కోసం కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) 5 పడకల డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కోసం విశేష కృషి చేశారు. రోషికేర్ ప్రైవేటు సంస్థ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ప్రైవేటు ఆస్పత్రులలో డయాలసిస్ చేయించుకోవాలంటే ప్రతిసారి రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతోంది. గతంలో కైకలూరు నియోజకవర్గం నుంచి ఏలూరు, భీమవరం, విజయవాడ ప్రాంతాలకు డయాలసిస్ చేయించుకోడానికి రోగులు వెళ్ళేవారు. ఇప్పుడు కైకలూరులోనే సెంటర్ అందుబాటులోకి రావడంతో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు శ్యామ్ ఫణి కుమార్ సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కరోనా సమయంలో దాతల సాయంతో ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేశారు. డయాలసిస్ సెంటర్ రావడంలోనూ విశేష కృషి చేశారు. డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవంలో డాక్టర్ నికిలేష్ కరి, మేనేజర్ సయ్యద్ బియా ఉల్ హక్, డయాలసిస్ టెక్నిషియన్ జి.రాజేష్, స్టాఫ్ నర్సు పి.జ్యోతి పాల్గొన్నారు.

కామినేని మంత్రిగా చేసింది శూన్యం

బీజేపీ ప్రస్తుత అభ్యర్థి కామినేని శ్రీనివాస్ 2014లో బీజేపీ పొత్తుల్లో భాగంగా గెలిచి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. రూ.7కోట్ల 65లక్షలతో కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. మంత్రిగా ఉన్నప్పటికీ డాక్టర్ల కొరతను తీర్చలేదు. అనేక గదులు ఖాళీగానే ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రజలు ఇక్కడకు రావడం డాక్టర్ల కొరత, వసతులు లేకపోవడంతో ఆరోగ్యశాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఏమిటని నిరశనలు తెలిపిన ఘటనలూ ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే డీఎన్నార్, ఆయన కుమారుడు శ్యామ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. సీహెచ్‌సీలో ఏడుగురు డాక్టర్లు, 39 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో ఓపీల సంఖ్య పెరిగింది. ఇంత జరుగుతున్నప్పటికీ ఎన్నికలు రావడంతో తాను మంత్రిగా ఏం చేయలేకపోయినా చేసిన వారిని అభినందించడం పోయి కామినేని శ్రీనివాస్ విమర్శలు చేయడంపై సొంత పార్టీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో అంబులెన్స్ డ్రైవర్ల చేరిక



ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల సంఘం నేతలు

ఏలూరు టౌన్: ఏలూరులో వైఎస్సార్‌సీపీ విజయానికి తమవంతు సైనికుల్లా పనిచేస్తామంటూ ఆయా సంఘాల నేతలు, సభ్యులు ముందుకు వస్తున్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఏలూరు జీజీహెచ్ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు గొల్లపెల్లి చుక్కయ్య, కార్యదర్శి షేక్ సమీర్, షేక్ సుభానీ, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షులు పిల్లి నతానియేలు తదితరులు ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఎంతో కృషి చేశారన్నారు. ఆళ్ల నాని మళ్లీ గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఎన్నికల్లో ఆళ్లనాని గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. పేదలకు మంచి చేస్తున్న ఆళ్ల నానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే తనకు, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వనితపై హత్యాయత్నం.. సహించరాని నేరం

వనితను కలిసి సంఘీభావం తెలిపిన ఎస్సీ సెల్ నాయకులు



తానేటి వనితను కలిసి సంఘీభావం తెలుపుతున్న జిల్లా ఎస్సీ సెల్ నాయకులు

భీమడోలు: రాష్ట్ర హోంమంత్రి, దళిత మహిళా రాష్ట్ర నేత తానేటి వనితపై నల్లజర్లలో టీడీపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడడం సహించరాని నేరమని జిల్లా ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు. భీమడోలు మండలానికి చెందిన జిల్లా ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి అంబటి నాగేంద్ర ప్రసాద్, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావులతో పాటు పలువురు నల్లజర్లలో బుధవారం తానేటి వనితను కలిసి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి నల్లజర్లలో ప్రచారం ముగించుకుని వస్తున్న వనితపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడడం దారుణమని, వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుపుకోవాల్సి ఉండగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు దాడులకు పాల్పడుతూ పేట్రేగిపోతున్నారన్నారు. సీసీ ఫుటేజీల్లో గుర్తించిన టీడీపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని, నల్లజర్లలో తానేటి వనిత అఖండ మెజార్టీతో గెలుస్తుందన్న సర్వేలతో టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, నాయకులు ముళ్లపూడి బాపిరాజు తదితరులు తమ అనుచరులతో వనితపై దాడి చేయించారన్నారు. అలాంటి సంఘ విద్రోహ శక్తులపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గోపాలపురంలో వైఎస్సార్ సీపీ విజయానికి చేరువగా ఉండడాన్ని జీర్ణించుకోలేక కూటమి నాయకులు ఇలాంటి అసాంఘిక శక్తులతో దాడులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర హోంమంత్రిపై దాడులకు తెగపడుతున్నారంటే టీడీపీ నాయకులు ఎంతకు బరితెగించారో ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. ఎన్నికల ఘట్టం ముగిసే వరకు వనితకు మరింత సెక్యూరిటీని పెంచాలని వారు కోరారు. ఎన్ని శక్తులు అడ్డుపడినా తానేటి విజయం నల్లేరుపై నడకే అని ఎస్సీ సంఘం నాయకులు తెలిపారు. కూటమి అభ్యర్థులకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

పోలవరం అభివృద్ధే నా లక్ష్యం

సాక్షితో వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి



ఇంటర్వ్యూ

ఆమె అత్తారిల్లు రాజకీయాలకు పుట్టినిల్లు. మామ సుదీర్ఘంగా 30 ఏళ్లపాటు వివిధ పదవులలో ప్రజలకు సేవలందించగా.. భర్త ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలుపొంది ప్రజా జీవితానికి అంకితమయ్యారు. అటువంటి కుటుంబం నుంచి ఆమె ఈసారి ఎన్నికల బరిలో నిలిచారు. ఉపాధ్యాయ వృత్తిని సైతం వదులుకుని ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇరవై ఏళ్లుగా విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో పాటుపడిన ఈ పంతులమ్మ రాజకీయాల్లో సైతం తనదైన ముద్ర వేసేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. ప్రచారంలో సైతం ప్రత్యర్థి అభ్యర్థి కంటే జోరుగా దూసుకుపోతున్న ఆమె తనకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని, తాను గెలిస్తే అన్ని రంగాల్లో పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అంటున్నారు. పోలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి మనోగతం ఇది.

- బుట్టాయగూడెం

ప్రశ్న: మీరు టీచర్ కదా.. రాజకీయాల్లోకి రావాలని ఎందుకు అనిపించింది?

రాజ్యలక్ష్మి: బుట్టాయగూడెం, దొరమామిడి గ్రామాల్లో 20 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశా. ప్రజలకు సేవ చేయడమంటే నాకెంతో ఇష్టం. ఈసారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున మహిళలకు స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలోనే జగనన్న, నా భర్త తెల్లం బాలరాజు నాకు పోటీ చేసే అవకాశం కల్పించారు. అందుకే ఉపాధ్యాయ వృత్తిని వదులుకుని రాజకీయాల్లో అడుగుపెట్టా.

ప్రశ్న: మీ రాజకీయ నేపథ్యం గురించి చెప్పండి.

రాజ్యలక్ష్మి: మాది రాజకీయ కుటుంబం. మామగారు తెల్లం చినవడ్డీ పంచాయతీ సమితి ప్రెసిడెంట్‌గా, ఎంపీపీగా, సొసైటీ అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఆయన సుమారు 30 ఏళ్ల పాటు రాజకీయాల్లోనే జీవితం గడిపారు. నా భర్త తెల్లం బాలరాజు 2004 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. నాలుసార్లు ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సేవ చేశారు.

ప్రశ్న: పోలవరం అభివృద్ధికి తెల్లం బాలరాజు ఏం చేశారో మీకు అవగాహన ఉందా?

రాజ్యలక్ష్మి: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పోగొండ రిజర్వాయర్, కొండ కాల్వపై నాలుగు హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణాలకు కృషి చేశారు. సన్నచిన్నకారు రైతులకు పొగాకు బేరన్ లైసెన్స్‌లు ఇప్పించి వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించారు. పోడు భూములకు పట్టాలు ఇప్పించారు. ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. సీఎం జగనన్న పాలనలో గడిచిన 58 నెలల్లో సంక్షేమ పథకాల రూపంలో రూ.923.14 కోట్లు, అభివృద్ధి పథకాల రూపంలో రూ.665.77 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. వైద్య రంగ అభివృద్ధికి, రోడ్ల నిర్మాణానికి విశేష కృషి చేశారు.

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

రాజ్యలక్ష్మి: నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో నాకు సహకరిస్తున్నారు. సీఎం జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు.. ప్రచారానికి వెళ్లిన నాకు ఎదురొచ్చి మరీ హారతులు పట్టి ఘన స్వాగతం పలుకుతుంటే చాలా సంతోషంగా ఉంది. జగనన్న చెబితే చేస్తాడని.. సంక్షేమ పథకాల అమలులో ఆయనకు ఎవ్వరూ సాటిలేరని.. జగనన్న ప్రభుత్వానికే మళ్లీ పట్టం కడతామని ప్రజలు స్వచ్ఛందంగా చెబుతున్నారు.

ప్రశ్న : కూటమి మేనిఫెస్టోపై మీ అభిప్రాయం ఏమిటి?

రాజ్యలక్ష్మి : టీడీపీ మేనిఫెస్టో అంతా బూటకం. మోసం, దగా వంచనకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు. గత ఎన్నికల్లో రుణమాఫీ అమలుచేస్తానని హామీ ఇచ్చి.. ఆ తరువాత అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేశాడు. మళ్లీ ఈ ఎన్నికల్లో కూడా అధికార దాహంతో అమలు సాధ్యం కాని హామీలను మేనిఫెస్టోలో పెట్టి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నాడు. ప్రజలు కూటమి అభ్యర్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నా.

ప్రశ్న: ఎన్నికల ప్రచారంలో మీరు గమనించిన విషయాలేమిటి?

రాజ్యలక్ష్మి : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాకు టికెట్ కేటాయించిన తర్వాత సుమారు నాలుగు నెలలుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించా. ప్రచారం చేశాను. నిర్వాసితుల సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వాటి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. నిర్వాసితులకు అండగా ఉంటా. అదే ప్రధాన సమస్యగా గుర్తించాను.

ప్రశ్న: ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

రాజ్యలక్ష్మి : ఎంతో నమ్మకంతో జగనన్న పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఇచ్చారు. ప్రజల ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో గెలుపొందితే ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. పోలవరం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

ప్రశ్న: వైఎస్సార్‌సీపీ విజయానికి కలిసొచ్చే అంశాలేమిటి?

రాజ్యలక్ష్మి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచింది. మాట తప్పని, మడమతిప్పని నాయకుడిగా ప్రజల్లో మంచి పేరుంది. గడచిన ఐదేళ్లలో జగనన్న అమలు చేసిన నవరత్న పథకాలు పార్టీ విజయానికి దోహదపడతాయి. మళ్లీ జగనన్న గెలిస్తేనే సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని ప్రతి ఒక్కరి మనసులో ఉంది. ప్రజలకు జగనన్నపై ఉన్న నమ్మకమే వైఎస్సార్ సీపీని గెలిపిస్తుంది.

ప్రశ్న: ప్రజలకు మీరు ఏం చెప్పాలనుకుంటున్నారు?

రాజ్యలక్ష్మి: పోలవరం నియోజకవర్గ ప్రజలు విజ్ఞులు. పూటకో పార్టీ మారుతూ ఎన్నికల ముందు మాత్రమే కనిపించే కూటమి అభ్యర్థులు ఎంతవరకు పనిచేస్తారో వారికి తెలుసు. కరోనా కష్టకాలంలో ఈ నాయకులు అప్పుడు కనిపించలేదు. ప్రజలు విలవిల్లాడుతున్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే వారికి అండగా నిలిచింది. నా భర్త తెల్లం బాలరాజు తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజలకు నిత్యావసరాలు అందించి అండగానిలిచారు. నా భర్త తెల్లం బాలరాజు చేసిన సేవలను, అభివృద్ధిని చూసి నన్ను గెలిపిస్తారని ఆశిస్తున్నా. పోలవరం అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తా.

సంక్షేమ 'ఆటో'గ్రాఫ్

భార్యాభర్తలిద్దరూ రెక్కలుముక్కలు చేసుకుంటేగానీ నాలుగేళ్లు నోట్లోకి వెళ్లని నిరుపేద కుటుంబం. వచ్చిన దానిలో సగం అద్దెకే పోగా నెలంతా పిల్లలతో సహా అర్ధాకలితో అలమటించిన వైనం.. గత ప్రభుత్వం నిరాదరణతో సమస్యలతోనే నిత్యం సతమతమైన దైన్యం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వారి కష్టాలన్నీ తీరిపోయాయి. గుండె లోతుల్లో దాగి ఉన్న దుఃఖం ఒక్కసారిగా భావోద్వేగమై.. బాష్పాల రూపంలో పొంగుకొచ్చింది. దేవుడే దిగివచ్చినట్టు హృదయం ఉప్పొంగింది. ఫలితంగా వరాల రేడు పాలన నిరంతరం కొనసాగాలని ఆ కుటుంబం ఆకాంక్షిస్తోంది.

- కొత్తపల్లి వంశీ, విలేకరి, దెందులూరు, పశ్చిమగోదావరి జిల్లా



దెందులూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన బాలిన గిరిబాబు, ప్రసన్నల కుటుంబం

- పథకాలతో ప్రగతి పథం
- చిరుకుటుంబానికి ఎంతో మేలు
- కుమార్తె వినికిడి సమస్యకు ఆరోగ్యశ్రీ చికిత్స

ఏలూరు జిల్లా దెందులూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన బాలిన గిరిబాబు, ప్రసన్నలకు ఇద్దరు కుమార్తెలు. 15 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నివాసం. గిరిబాబు ఆటో డ్రైవర్. వచ్చే రాదయం అంతంతమాత్రమే. ప్రసన్న కూడా చిన్నచిన్న పనులు చేస్తుంటుంది. అత్తెసరు ఆదాయంతోనే పిల్లలను చదివించుకునేవారు. ప్రస్తుతం పెద్ద కుమార్తె మహిత 6వ తరగతి, చిన్న కుమార్తె హేమశ్రీ 4వ తరగతి చదువుతున్నారు. హేమశ్రీకి వినికిడి సమస్య ఉండేది. వైద్యులకు చూపిస్తే రూ.6లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అసలే అంతంతమాత్రం బతుకులు చికిత్స ఎలా చేయించాలో తెలీక గిరిబాబు, ప్రసన్న తల్లడిల్లారు. రేషన్ కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా గత ప్రభుత్వం కరుణించలేదు.

దశ తిరిగింది

2019 తర్వాత..

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గిరిబాబు కుటుంబ పరిస్థితి మారిపోయింది. భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురించాయి. నవరత్న పథకాలు ఆదరువుగా నిలిచాయి. ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు ఉచితంగా ఇచ్చారు. గిరిబాబుకు వాహనమిత్ర పథకం ద్వారా ఏటా రూ.పదివేల చొప్పున రూ.40వేలు అందాయి. డ్వాక్రా సభ్యురాలిగా ఉన్న ప్రసన్నకు నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీగా రూ.60 వేలు వచ్చాయి. డ్వాక్రా గ్రూపులో లక్ష రూపాయల రుణం మంజూరైంది. 6వ తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె మహితకు నాలుగేళ్ళుగా అమ్మఒడి పథకం ద్వారా రూ.60 వేలు అందాయి. జగనన్న విద్యాకానుక అందింది. వినికిడి సమస్యతో ఉన్న రెండో కుమార్తె హేమశ్రీకి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స చేశారు. అంతేకాకుండా ప్రతినెలా హేమశ్రీకి రూ.3 వేల చొప్పున పింఛన్ అందుతోంది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కొత్త ఆరోగ్యశ్రీ కార్డు మంజూరయ్యాయి. ఫలితంగా గిరిబాబు కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీమళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటోంది.

వైద్య 'ఆనందిని'

మెడలో స్టెతస్కోప్ వేసుకుని పేదల గుండె చప్పుడు వినాలని ఆ చిన్నారి ఉబలాటపడింది. ఒక్కో తరగతి పైకొస్తున్న కొద్దీ ఆ ఆశ బలమైన సంకల్పంగా మారింది. కూతురి తపన చూసి తల్లిదండ్రులు కలవరపడ్డారు. తమ స్తోమతకు వైద్య విద్య సాధ్యమేనా అని ఆందోళన చెందారు. పట్టువదలని ఆ విద్యార్థిని కష్టపడి చదివింది. కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ సీటు పొందింది. అక్కడకు వెళ్లి చదవడం ఎలా అనుకుంటున్న తరుణంలో చీకటిలో వెలుగు దివ్వెలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం వరమైంది. ఆన్‌లైన్‌లో ఆఖరి రోజు దరఖాస్తు చేసిన ఆ విద్యార్థినికి సంక్షేమ సర్కారు అండగా నిలిచింది. వైద్యవిద్య కయ్యే పూర్తి ఫీజు భరించేందుకు ముందుకొచ్చింది. అక్కడికెళ్లేందుకు అయ్యే ఖర్చులనూ భరించింది. ఇప్పుడు కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న ఆ విద్యార్థిని మోములో ఆనందం తొణికిసలాడుతోంది.



వైద్య విద్యార్థిని జొన్నలగడ్డ నందిని, తల్లిదండ్రులు, తమ్ముడు

- పేద విద్యార్థినికి డాక్టర్ విద్య
- కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్
- వరమైన జగనన్న విదేశీ విద్యాదీవెన

ఏలూరు తంగెళ్లమూడి నెహర్‌మసీద్ ప్రాంతానికి చెందిన జొన్నలగడ్డ నర్సింహరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. నర్సింహరాజు వ్యవసాయం చేస్తారు. రాజ్యలక్ష్మి గృహిణి. వీరి పెద్ద కుమార్తె జొన్నలగడ్డ నందినికి కజకిస్థాన్‌లో అల్ ఫరాబీ ఖజాక్ నేషన్ యూనివర్సిటీ (అంతర్జాతీయంగా 150వ ర్యాంకు)లో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఈ చదువుకు జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలిచింది. పూర్తి ఫీజు రూ.24 లక్షలు భరించేందుకు ముందుకొచ్చింది. మొదటి ఏడాది రూ.4 లక్షల 7 వేలు, రెండో సంవత్సరం ఫీజు కూడా ఇటీవల రూ.4 లక్షల 7 వేలు యూనివర్సిటీకి ప్రభుత్వం చెల్లించింది. నందిని కజకిస్థాన్ వెళ్లేందుకు వీసా, విమాన చార్జీలు సైతం ప్రభుత్వమే భరించింది. సుమారుగా రూ.50 వేల వరకు వీటి కోసం ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇదిలా ఉంటే నర్సింహరాజు కుమారుడు రాహుల్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రాహుల్‌కు అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరుతోంది.

దశ తిరిగింది

ఏలూరు నగరంలోనే పదుల సంఖ్యలో లబ్ధిదారులు

రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అనేక అద్భుతమైన ఘటనలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో ఆవిష్కృతమయ్యాయి. ఏలూరు నగరంలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంలో వైద్య విద్యను అభ్యసించేవారు ఇంకా పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం. జగనన్న అందిస్తున్న పథకాలు తమలాంటి పేద విద్యార్థులు ఎందరికో ఉన్నత భవితను అందిస్తున్నాయని నందిని ఆనందంగా చెబుతోంది.

- ఏలూరు టౌన్

జగనన్నకు కృతజ్ఞతలు

మా కుమార్తె డాక్టర్ కావాలన్న కోరిక జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా నెరవేరుతోంది. మాలాంటి కుటుంబాలకు రూ.లక్షలు ఖర్చు చేసి ఉన్నత విద్య చదివించడం సాధ్యంకాని పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు దేవుడిలా మారారు. భవిష్యత్తులోనూ ఆయన మరింతమంది పేద విద్యార్థుల భవితకు అండగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాం. ఆయనకు కృతజ్ఞతలు.

- జొన్నలగడ్డ రాజ్యలక్ష్మి, విద్యార్థిని తల్లి

జగన్ జమానాలోనే ముస్లింల అభివృద్ధి



ఎండీ ఇస్మాయిల్ షరీఫ్

ఆయనొక సామాజికవేత్త.. ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఆయన తన ఇంటి వద్దనే వెల్డింగ్ పనులు చేసుకుంటూ 8 మంది సంతానాన్ని చదివించి, ప్రయోజకులను చేసి, కుటుంబ అభివృద్ధికి పాటుపడుతున్నారు. అదే సమయంలో సామాజిక బాధ్యతగా నగరంలోని వివిధ సమస్యలను స్థానిక అధికారులతో పాటు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. కానీ తాను అనారోగ్యం పాలైనప్పుడు ఆదుకున్నది ఆరోగ్యశ్రీయే అని.. కుటుంబం ఆర్థిక చేయూతకు జగన్ పథకాలే దోహదపడ్డాయని చెబుతున్నారు. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ షరీఫ్. జగన్ జమానాలోనే ముస్లింల పూర్తి స్థాయి అభివృద్ధి జరుగుతుందని, ముస్లింలంతా అబద్ధపు వాగ్దానాలకు ఆకర్షితులు కాకుండా ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డ వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

- ఏలూరు (ఆర్ఆర్‌పేట)

ఇటీవల ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. నగరంలోని ఒక కార్పొరేట్ వైద్య కళాశాలలో ఆయనకు చేసిన శస్త్రచికిత్స వికటించి మృత్యువుతో పోరాడారు. ఆయనకు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయించుకోవడానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. అయినప్పటికీ ఆయనకు వ్యాధి నయం కాకపోవడంతో మరోసారి శస్త్రచికిత్స అవసరమైంది. ఆరోగ్యశ్రీ నిబంధనల మేరకు ఒకసారి చికిత్స చేసిన వ్యాధికి మరోసారి ఆరోగ్యశ్రీ వర్తించదు. దీంతో శస్త్రచికిత్స చేయించుకోవడానికి చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆయనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేసిన ఒక ప్రకటన వరంగా మారింది. ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయాన్ని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం చేసిన ప్రకటనతో ఆయనకు మరోసారి శస్త్రచికిత్స చేయించుకునే అవకాశం కలిగింది.

కుటుంబ సభ్యులకూ లబ్ధి : ఇస్మాయిల్ కుమార్తెకు ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంలో హెల్త్ సెక్రటరీ ఉద్యోగం వచ్చింది. ఈ ఉద్యోగం ద్వారా ఆమె నెలకు రూ.32 వేలు జీతంగా పొందుతోంది. ఆయన మరొక కుమార్తెకు షాదీ తోఫాగా వివాహ ఖర్చుల నిమిత్తం జగన్ ప్రభుత్వం రూ.లక్ష విడుదల చేసింది. 72 ఏళ్ల వయసు కలిగిన అత్త హుస్సేనీబీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పింఛన్ కోసం తొక్కని గడప లేదు. ఎంపీటీసీని, ప్రజల వద్దకు పాలనలో అధికారులను, జన్మభూమి కమిటీలను ఎన్నిసార్లు కోరినా వృద్ధాప్య పింఛన్ మంజూరు కాలేదు. అనంతరం 2019వ సంవత్సరంలో వచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ఆయన ఇంటికి నేరుగా వచ్చి హుస్సేనీబీకి పింఛన్ వచ్చే ఏర్పాటు చేశారు. పిల్లలకు అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు, భార్యకు చేయూత పథకం ద్వారా రూ.18 వేలు ఏడాదికి జమఅవుతున్నాయని ఇస్మాయిల్ తెలిపారు. జగన్‌కు ముస్లింలు అండగా నిలవాలని ఆయన కోరుతున్నారు.

అభివాదం చేస్తూ.. హారతులు అందుకుంటూ..

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచార అంకానికి కొద్ది రోజులే మిగిలి ఉండడంతో అభ్యర్థుల ప్రచార హోరుతో గ్రామాలు మార్మోగుతున్నాయి. అవ్వా, తాతా, అక్కా, అన్నా.. మన గుర్తు ఫ్యాను.. అని ప్రతి ఒక్కరికీ చెబుతూ సంక్షేమ రాజ్యానికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తమ గ్రామాలకు వచ్చిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ప్రజలు అడగడుగునా ఘన స్వాగతం పలుకుతూ.. విజేతలై తిరిగిరండి అని.. వీర తిలకం దిద్దుతున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



పెదవేగి: దెందులూరు అభ్యర్థి అబ్బయ్యచౌదరికి పూలతో ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు



ఉంగుటూరు: కైకరంలో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుబాబుకు హారతులు ఇస్తున్న దృశ్యం



చింతలపూడి: నాగిరెడ్డిగూడెంలో ప్రజలను పలకరిస్తున్న చింతలపూడి అభ్యర్థి కంభం విజయరాజు



నూజివీడు: మిట్టగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఏలూరు వన్‌టౌన్: ప్రచారంలో ప్రజలను పలకరిస్తూ కరచాలనం చేస్తున్న ఏలూరు అభ్యర్థి ఆళ్లనాని



పోలవరం: వింజరం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న పోలవరం అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలంలో మహిళలతో కరచాలనం చేస్తున్న తానేటి వనిత